ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - రేపల్లె

పోరాటాలతోనే సమస్యలు పరిష్కార మవుతాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమా మహేశ్వరరావు తెలిపారు. సిఐటియు బాపట్ల జిల్లా 2వ మహాసభల సందర్భంగా ప్రదర్శన, బహిరంగ సభతో కార్మికులు కదం తొక్కారు. బస్టాండ్ సెంటర్ నుంచి నెహ్రూ బొమ్మ వరకు ర్యాలీ శనివారం నిర్వహించారు. ఎర్రజెండాలు చేతబట్టి, డప్పు కళాకారులు, కోలాట దళాలతో ఉత్సాహభరితంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ బొమ్మ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోనున్న ప్రభుత్వాలు నిర్బంధాలు ప్రయోగి స్తున్నాయని తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ కార్మికుల శ్రమ దోచుకుంటున్నాయన్నారు. 8 గంటల పనిని 13 గంటలకు పెంచటం కార్మికులకు ద్రోహం చేయటమేనని తెలిపారు. మేడే ద్వారా సాధించుకున్న 8 గంటల పనికి తూట్లు పొడవడమని ఆరోపించారు. చిరు ఉద్యోగులుగా ఉన్న అంగన్‌వాడీ, ▶ 2లో

బాపట్ల జిల్లాకలెక్టర్‌కు ఉత్తమ అవార్డు

అవార్డు అందుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అనంతపురం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో పర్యాటక శాఖ అభివృద్ధి పబ్లిసిటీపై ప్రతిభ కనపరిచినందుకు ప్రస్తుత బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కలెక్టర్ వినోద్ కుమార్ ఉత్తమ అవార్డును అందుకున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు

- దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత
- పడిపోతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు

ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు (ఫైల్)

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఇసుక అక్రమ తవ్వకాలు, మట్టి, కంకర తవ్వకాలు, గ్రానైట్ క్వారీల ప్రభావంతో జిల్లాలో పర్యావరణం సమతుల్యత కోల్పోయింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బాపట్ల జిల్లా లోని కోస్తా తీరప్రాంతం, కష్ణానది పరివాహక ప్రాంతాల్లో నీరు సమృద్ధి ఉంటుంది కనుక భూగర్భ జలాలు కూడా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉండాలి. కష్ణానది పరివాహక ప్రాంతమైన కొల్లూరు, వేమూరు, రేపల్లె, బట్టిప్రోలు మండలాలు, అమృతలూరు మండలం కూచిపూడి, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలోని అద్దంకి, కోరిశపాడు, కోస్తా తీరంలోని చీరాల, వేటపాలెం,గ్రానైట్ క్వారీలు ఉన్న బల్లికురవ మండలాల్లో భూగర్భ జలాలు నిర్దేశిత ప్రమాణాల కంటే దిగువన ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కొల్లూరు మండలంలోని పోతర్లంక, చింతర్లంక,బట్టిప్రోలు మండలం పెదపులివర్రు ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు యథేశ్చగా సాగాయి. చీరాల, వేటపాలెం మండలాల్లోనూ ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. అద్దంకి ప్రాంతంలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరిగింది. కృష్ణా నది, గుండ్లకమ్మ నదుల నుంచి ఇసుక కోసం తోడేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలోని పెద్ద పెద్ద ఇసుక దిబ్బలు కనుమరుగై గోతులు ఏర్పడ్డాయి. బల్లికురవలో కొండలు, భూమిని తొలిచి గ్రానైట్ తీస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం తగ్గుతువస్తుంది. నిర్దేశిత ప్రమాణాల మేరకు రెండు మీటర్ల కంటే ఎక్కువ లోతులో నీరు ఉంటే భూగర్భ జలాలు పడిపోతున్నట్లు పేరొంటున్నారు. భూగర్భ జలవనరులపై దష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం గత వేసవిలో జరిపిన అధ్యయనం ప్రకారం సుమారు 7,800 గ్రామాల్లో భూగర్భ జలాల లభ్యత ఆశించిన స్థాయిలో లేదని తేల్చారు. రీఛార్జికి మించి నీటిని తోడేస్తున్న గ్రామాల్లో అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 93, బాపట్ల జిల్లాలో 18 గ్రామాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ ప్రాంతాల్లో వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తారు. అక్కడ కొత్తగా వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు బోర్లు తవ్వుకునేందుకు అనుమతులు ఇవ్వరు. తాగునీటికి మాత్రమే బోర్లు వేసే అవకాశం ఉంటుంది. ఓ నీటి సంవత్సరంలో ఓ గ్రామంలో సగటున 100 యూనిట్ల భూగర్భ జలాలు రీఛార్జి అయితే ఆ గ్రామంలో ఆ ఏడాది 70 యూనిట్ల కన్నా తక్కువగా భూగర్భ జలాలు వాడుకుంటే అక్కడ వినియోగం సక్రమంగా ఉన్నట్లు భావిస్తారు. నీటి వినియోగం 90 నుంచి 100 యూనిట్లుగా ఉంటే ప్రమాదకర ధోరణిగా భావిస్తారు. చెక్ డ్యామ్‌లు నిర్మించడం, కొండల అంచుల వద్ద కాంటూర్ కందకాలు తీయడం, ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, పంట కుంటల ద్వారా భూగర్భ జలాలను పెంచే ప్రయత్నం చేస్తారు. అయితే ▶ 2లో

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

- స్వల్ప అంశాలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- కీలకమైన అంశాలపై చర్చ శూన్యం

మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన ప్రతిపక్ష సభ్యులు ఇద్దరూ సభకు దూరంగా ఉన్నారు. పార్టీ నిర్ణయంతో చాలా కాలంగా వారు అసెంబ్లీకి వెళ్లడం లేదు. ఇక పాలకపక్షం నుంచి హాజరయ్యే సభ్యులు తమ నియోజకవర్గాల్లో కొన్ని సమస్యలను ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావిస్తున్నారు. అరకొర అంశాలే చర్చకు వచ్చాయి. ఇంకా చెప్పాలంటే ఇప్పటికే పలుసార్లు ప్రస్తావించివే ఉన్నాయి. కీలకమైన సమస్యలు సభలో ఎవరూ ప్రస్తావించ లేకపోయారు. పాలకపక్షం నుంచి అంత సాహసం చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. మంత్రులు మాత్రం సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. జిల్లాలో పశ్చిమప్రాంత ఎమ్మెల్యేలు కొన్ని సమస్యలు ప్రస్తావించారు.

కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి నియోజకవర్గం లోని హాస్టళ్ల సమస్యలు, అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తిచేయాలని, ట్రిపుల్ ఐటీ కాలేజీ నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలో చాలా కాలంగా పెండింగులో ఉన్న షాదీఖానా పూర్తిచేయాలని కోరారు. ఇందిరమ్మ కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని అభ్యర్థించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి భూసారపరీక్షలు నిర్వహించేందుకు రూ.60లక్షలతో ఏర్పాటు చేసిన మొబైల్‌సాయిల్ టెస్టింగు ల్యాబ్‌లో సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా ఉందని తెలిపారు. సిబ్బందిని నియమించి వెనుకబడిన ప్రాంతాల్లో భూ సారపరీక్షలు నిర్వహించేలా చూడాలని కోరారు. మిగతా ఎమ్మెల్యేలు మాట్లాడలేదు. సమావేశాల్లో కీలకమైన సమస్యలు ప్రస్తావిస్తారని ఆశిస్తే అది నిరాశే అయింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్యాకేజీలు, జిల్లా పాల డెయిరీ పునరుద్ధరణ, పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు, పంట తగ్గిస్తే ప్రత్యామ్నాయ ▶ 2లో

పొట్టకూటికి వెళ్లి మృత్యు ఒడికి..

ఇద్దరు మహిళా కూలీలు మృతి

▶ 3లో

వలపర్లలో భారీ చోరీ

▶ 3లో

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జలవనరుల శాఖ ద్వారా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని జలవనుల శాఖ ద్వారా జిల్లాలో చేపడుతున్న పనులపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో జలవనరుల శాఖ ద్వారా చేపట్టిన వాటిలో అత్యవసర పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, భూగర్భ జలాలు, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకొని జలవనుల శాఖ పనిచేయాలన్నారు, కాలువ గట్లపై మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 716 పనులు చేపట్టామని, అందులో 148 పనులు పూర్తి ▶ 2లో

ఇసుక అక్రమ తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

బాపట్ల జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఇసుక, మట్టి, కంకర అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడి భూగర్భ జలాలను పెంచాలంటే అక్రమ ఇసుక దందాలు ఆపాలి. జిల్లాలోని కోస్తా ప్రాంతంలోనూ భూగర్భ జలమట్టం తగ్గుముఖం పట్టడం పర్యావరణానికి మంచిది కాదని, ఆయా గ్రామాల్లో నీటిని రీఛార్జి చేసేందుకు సమగ్ర నీటి ప్రణాళిక అవసరమని భావించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. గ్రానైట్ క్వారీలు, మట్టి, కంకర తవ్వకాలను అరికడుతూనే భూగర్భ జలాలు పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భావించారు. ఇందు కోసం రూ.8 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా!

ఇటీవల నిర్వహించిన భూగర్భ జలశాఖ సమావేశంలో బాపట్ల జిల్లా లోని కష్ణానది పరివాహక ప్రాంత మండలాల్లో కూడా భూగర్భ జలాలు కూడా నిర్దేశిత ప్రమాణాల కన్నా దిగువకు ఉండడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. ఈ విషయమై గత కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ఇసుక, మట్టి, కంకర తవ్వకాల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఆశా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కనీసవేతనాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత మాట దాటవేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు పెంపదలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం వెల్ఫేర్ బోర్డు నుంచి నిధులు ఇచ్చే ఆదుకోపోవటం మోసం చేయటమేనని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. వేతనాలు పెంచకుండా అనేక ఆంక్షలు విధిస్తూ సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాల అమలుచేయాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు నికరమైన పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఎన్నికల్లో హామీ ప్రకారం విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరించకుండా ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీతో సాగిలపడిన రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష, అధికార పార్టీల నేతలు రాష్ట్ర అభివృద్ధి గురించి, కార్మికుల ఉపాధి గురించి ప్రశ్నించటం లేదన్నారు. సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందర్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి రేఖ ఎలిజబెత్, జిల్లా అధ్యక్షులు కె రూన్సీ, సిఐటియు జిల్లా నాయకులు జె ధర్మరాజు, తిరుమలరెడ్డి, కె వసంతరావు, కె శరత్ పాల్గొన్నారు.

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

పంటలు, వాటికి ధరలు వంటి అంశాలు ప్రస్తావనకు రాలేదు. సీజనల్ వ్యాధులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. వాటిపై కూడా చర్చలేదు. మార్కాపురం వైద్యకళాశాల పిపిపి పద్ధతిలో ప్రైవేటుకు అప్పగిస్తున్న అంశంపై వైసిపి సభ్యులు ఇద్దరూ సభకు వెళ్లనందున చర్చలో పాల్గొనే అవకాశం కోల్పోయారు. ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూసేకరణ, నిధుల కేటాయింపుపైనా స్పష్టత రాలేదు. పట్టణాల్లో టిట్కో ఇళ్ల విషయంపైనా సందిగ్ధత కొనసాగుతోంది. వీటిని గురించి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించలేదు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయని, 568 పనులు వివిధ దశలలో ఉన్నాయని జలవనరుల అధికారి అబుతలీమ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఇఇలు మురళీకృష్ణ, సుధాకర్, ప్రేమ కుమార్, సతీష్, శివరామ్ ప్రసాద్, డిఇలు మల్లిఖార్జునరావు, జాకీర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

తనిఖీ నిర్వహిస్తున్న సిఐ సుబ్బారావు, సిబ్బంది

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు

మార్కాపురం సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి-మార్కాపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరిస్తామని మార్కా పురం సిఐ పి సుబ్బారావు హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని గురువారం, శుక్రవారం అర్ధరాత్రి లాడ్జీలు, ఆర్‌టిసి బస్టాండు తదితర ప్రాంతాల్లో సిఐ సుబ్బారావుతో పాటు పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు, మార్కాపురం రూరల్ ఎస్ఐ పి అంకమరావు, ఇతర పోలీసు సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జ్యూవెలర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

జ్యూవెలర్స్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

హైదరాబాదులో శ్రీచక్ర జ్యూవెలర్స్ దుకాణాన్ని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. దోర్నాల మండలం ఐనముక్కల గ్రామానికి చెందిన వెన్నా వరప్రసాద్‌రెడ్డి నూతనంగా శ్రీచక్ర జ్యూవెలర్స్‌ను హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి, వైసీపీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకలో పాల్గొన్న కృష్ణ కిషోర్ రెడ్డి

'కేశఖండన'లో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు పట్టణంలోని, పోరుమామిళ్ల రోడ్డులో ఎంఎస్ మినీ ఫంక్షన్ హాల్‌లో దండు రంగయ్య, శ్రీమతి ప్రమీల కుమార్తె చి. ప్రియదర్శిని కేశఖండన కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు, టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, డైరెక్టర్ బిజ్జాల తిరుమలరెడ్డి, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, గుర్రం దానియేలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని భూ విలాస వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా విశేష పూజలు, కుంకుమ అర్చనలు అమ్మవారికి వివిధ అలంకరణల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన శనివారం లలిత త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి అన్నమరాజు రమేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దాతలు రామచంద్రయ్య దంపతులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయించారు. భక్తులకి పాత్రకాల, ప్రదోషకాల, కుంకుమ అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళా విభూషణ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ వీదెళ్ల నాగేశ్వరరావు, పూజారి పవన్ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపు లక్ష్మిరెడ్డి, యిమ్మడిశెట్టి త్రిపురేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

29న సామూహిక అక్షరాభ్యాస వేడుకలు

ప్రజాశక్తి సంతనూతలపాడు

సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో ఈ నెల 29న చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాస వేడుకలు నిర్వహిస్తున్నట్లు త్రిపురాంతక స్వామి ఆలయ డైరెక్టర్ సన్నమూరి వెంకట సుశీల, సుబ్బనాచారి శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ గురువర్యులు కోదాటి కోటేశ్వరరావుచే చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ వేడుకలకు తీసుకొని వచ్చి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందవలసిందిగా వారు కోరారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No : 330/2025

యాళ్ళూరి బ్రహ్మారెడ్డి ..వాది

వర్సస్

కిస్టుపాటి రవికుమార్ రెడ్డి .. ప్రతివాది

To

ప్రతివాది:

కిస్టుపాటి రవికుమార్ రెడ్డి తండ్రి చిన్నారెడ్డి, 45 సం.ల వయస్సు, హిందు, వ్యాపారం, శ్రీనివాసనగర్, కరెంటు ఆఫీసు వెనుకవైపు, గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది:17-10-2025న ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు

తేదీ : 27-09-2025

ఇట్లు

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు, వాది పరం అడ్వకేట్, గిద్దలూరు.

ఆర్డర్ 21, రూల్ 66 సి.పి.సి.నోటీసు (సేల్ నోటీసు)

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No : 3/2024

in

O.S. No : 405/2021

బొంతల వెంకట నారాయణగుప్త ..డిక్రీ హోల్డర్

వర్సస్

మంచికంటి వెంకట రంగసుబ్బరాయుడు ..జె.డి.ఆర్

To

జె.డి.ఆర్:

మంచికంటి వెంకట రంగసుబ్బరాయుడు తండ్రి శ్రీనివాసరావు, 47 సం.లు, హిందు, వ్యాపారం, డో.నెం. 6-91, నక్కావారి వీధి, బేస్తవారిపేట గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.

ఈ.పి. షెడ్యూలు దాఖల స్థిరాస్తులను వేలం వేయుటకు గాను వేలంషరతులను నిర్ణయించు నిమిత్తం డిక్రీహోల్డర్ అమలు అర్జీనిదాఖలు చేసుకొని వున్నందున సదరు విషయమై నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల 09-10-2025వ తేదీన ఉదయం 10:30గం.లకు పైకోర్టు వారి ఎదుట హాజరై నీఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల నీపరోక్షమందు సదరు పిటిషన్‌ను విచారించి తీర్మానము చేయబడునని నీకు తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు

తేదీ : 27-09-2025

ఇట్లు

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు, డి.హెచ్.ఆర్ పరం అడ్వకేట్, గిద్దలూరు.

CHANGE OF NAME

I, VELPURI KAMESHWARAMMA W/O.VELPURI VENKATA RAMA RAO(Old Name) Resident of 7-1202,Opp SSN Degree College,Hari Hara Nagar, Mungamur Donka,Ongole,Prakasam District, Andhra Pradesh. I have changed my name as GONUGUNTA KAMESWARAMMA W/o.VELPURI VENKATA RAMA RAO(New Name) Hence after my name is known as GONUGUNTA KAMESWARAMMA W/o.VELPURI VENKATA RAMA RAO(New Name)

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No : 668/2025

in

O.S. No : 330/2025

యాళ్ళూరి బ్రహ్మారెడ్డి ....పిటిషనర్/వాది

వర్సస్

కిస్టుపాటి రవికుమార్ రెడ్డి.....రెస్పాండెంట్/ప్రతివాది

To

రెస్పాండెంట్/ప్రతివాది:

కిస్టుపాటి రవికుమార్ రెడ్డి తండ్రి చిన్నారెడ్డి, 45 సం.ల వయస్సు, హిందు, వ్యాపారం, శ్రీనివాసనగర్, కరెంటు ఆఫీసు వెనుకవైపు, గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్ లో పిటిషనర్ /వాది నీ తాలుకు పిటిషన్ షెడ్యూలు ఆస్తులను హోల్ జప్తు చేయుంచగోరి పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటిషన్ లో నీకేమైనా ఆక్షేపణలు వున్న ఎడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది:17-10-2025 ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో నీ పరోక్ష మందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు

తేదీ : 27-09-2025

ఇట్లు

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు, పిటిషనర్ / వాది పరం అడ్వకేట్, గిద్దలూరు.

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No.63/2019

OS No.599/2012 IVth Addl. SCJC :: GUNTUR

అన్నా నరసింహారావు ...DHR

పువ్వాడ వెంకట మల్లికార్జున బాపి శెట్టి ... JDR

పై నెంబరు ఇ.పి.వారెంటు బాకీ రాబట్టుకొని నిమిత్తము గాను, ఈ దిగువ షెడ్యూలు దాఖలా, స్థిరాస్తిని పై కోర్టు వారు ఎదుట ది.17-10-2025న ఉదయం గం॥10.30 నిమిషములకు లగాయతు వేలం వేయబడును కావలసిన వారు పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. ఇతర వివరములు శ్రీ కోర్టులో నాజరుగారి వద్దగాని లేదా డిక్రీ హోల్డరు న్యాయవాది వద్ద గాని తెలుసుకొనవలెను.

షెడ్యూలు: ప్రకాశంజిల్లా – మార్కాపురం – రిజిస్ట్రేషన్ జిల్లా (ప్రస్తుతం ఒంగోలు), దరిశి సబ్ రిడి – మండలం :: కురిచేడు – గ్రామం :: కురిచేడు వార్డు నెం.8 – DOOR NO. 81, – 95.1/2 చదరపు గజములు కలిగిన స్థలంతోపాటు, విద్యుత్ కనెక్షన్ SC NO. 1401 ఉన్న మొదటి మరియు రెండవ అంతస్తులు కలిగిన ఆర్.సి.సి బిల్డింగ్‌కి హద్దులు:

తూర్పు: రోడ్డు,

దక్షిణం: రాయప్రోలు శ్రీనివాస్ శర్మ గారి ఆస్తి,

పడమర: పువ్వాడ హరినాథ్ గారి ఆస్తి,

ఉత్తరం: పువ్వాడ చలపతిరావు మరియు జెడియార్ ఇంటికి గల జాయింట్ గోడ

డిక్రీ హోల్డరు విలువ : రూ.20,00,000/-

అమీనా విలువ : రూ.22,00,000/-

వేలం తేది : 17-10-2025,

తదుపరి వాయిదా తేది: 24-10-2025

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు: **శ్రీ జీ.టి. శివశర్మ**, డిక్రీ హోల్డరు తరపు అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా.

దరిశి

తేది 27-09-2025

ప్రజాశక్తి 3
ఆదివారం 28 సెప్టెంబర్ 2025

స్థానికులను విచారిస్తున్న సిఐ

వలపర్లలో భారీ చోరీ

తాళం వేసిన ఉపాధ్యాయుడి ఇంట్లో పడిన దొంగలు

65 సవర్ల బంగారం, రెండున్నర కిలోల వెండి అపహరణ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

చోరీకి గురైన ఇల్లు

తాళం వేసి ఉన్న ఇంట్లో భారీగా బంగారం, వెండి చోరీకి గురైన సంఘటన మార్టూరు సమీపంలోని వలపర్ల గ్రామంలో శనివారం వెలుగుచూసింది. కొండమంజులూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కార్యంపూడి కొండలరావు, వలపర్ల హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న నాగిని దంపతులు స్థానిక సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల సెలవులకు కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి వలపర్ల ఇంటికి చేరుకున్న దంపతులకు తలుపు తాళాలు తీసి ఉండటం గమనించి నిర్ఘాంతపోయారు. ఇంట్లో ఉన్న సుమారు 65 సవర్ల బంగారం, రెండున్నర కేజీల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు స్వేచ్ఛగా సంచరించి కారం, పచ్చళ్ళు జల్లి చోరీకి పాల్పడినట్లుగా తెలుస్తోంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాపట్ల డీఎస్పీ, మార్టూరు సిఐ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంని పిలిపించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టకూటికెళ్లి మృత్యుఒడికి..

ట్రాక్టర్ పైనుంచి పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

మృతి చెందిన కూలీలు

డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ట్రాక్టర్ పైనుంచి పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలు కూలీ పనుల నిమిత్తం శంకరాపురం వైపు వెళుతున్న ట్రాక్టర్‌పై ఎక్కారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ట్రాక్టర్ అదుపు తప్పి పైన ఉన్న మహిళా కూలీలు కె.సువర్ణ (45), వేమునర్సులు(56) కిందపడడంతో అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన తోకల శ్రీనివాసరావు ఇంటిముందు ఇంకుడు గుంత మరమ్మతులు చేసుకుంటుండగా ట్రాక్టర్ అతనిపై నుంచి దూసుకు రావడంతో స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సిఐ ఆరాధ్యులు సుబ్బరాజు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద తీరును పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుల బంధువులు

ట్రాక్టర్ డ్రైవర్‌ని శిక్షించాలని ధర్నా

ట్రాక్టర్ డ్రైవర్‌ని శిక్షించాలని, నష్టపరిహారం చెల్లించాలని మృతుల బంధువులు భవాని సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. న్యాయం జరిగే వరకూ మృతదేహాలను తరలించమని కూర్చున్నారు. ఈ క్రమంలో సింగరకొండ వైపు నల్లవాగు వరకు దాదాపు మూడు గంటలు ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న సీఐ ఆరాధ్యుల సుబ్బరాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధిత బంధువులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకి నష్టపరిహారం అందించాలని పోలీసులను కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఏడుగుండ్లపాడులో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యల్లంటి సురేష్ (38) రాడ్ బెండింగ్ పనిచేస్తూ ఉంటాడు. ఒంగోలు నుంచి పని ముగించుకుని కూరగాయలు తీసుకొని ఇంటికి వస్తూ ఏడుగుండ్లపాడు గ్రామం వద్ద పాత మాలపాలెం నుంచి కొత్త మాలపాలెం వద్దకు వెళ్లేందుకు హైవే పై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట సైదులు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

9 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, సిబ్బంది, మాదకద్రవ్యాలను గుర్తించే ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్ రాక్సీతో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్శిల్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ఒక యువకుడు నుంచి సుమారు 6 కిలోల గంజాయి, మరొక బోగీలో 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు నిమిత్తం జి.ఆర్.పి. పోలీసులకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో స్నిఫర్ డాగ్ రాక్సీ కీలక పాత్ర పోషించింది. రాక్సీ వాసన ద్వారా అనుమానాస్పద వస్తువులను గుర్తించి, పోలీసుల చర్యలకు దోహదం చేసింది. ఈ తనిఖీల్లో మహిళా ఎస్సైలు శ్రీకాంత్, శివరామయ్య పాల్గొన్నారు.

టీకాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలి

జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కమల శ్రీ

సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కమలశ్రీ

ప్రజాశక్తి-మద్దిపాడు : రొటీన్ ఇమ్యునైజేషన్ రోగ నిరోధక శక్తి కార్యక్రమం ద్వారా అందించే టీకాల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలపాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కమలశ్రీ అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొటీన్ ఇమ్యునైజేషన్ రోగ నిరోధక శక్తి ద్వారా పిల్లలు, పెద్దలు, గర్భిణులు, వృద్ధులకు సిఫార్సు చేసిన టీకాల షెడ్యూలు, టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని కోరారు. టీకాల గురించి ఉన్న అపోహలను తొలగించి ప్రజలకు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. తదుపరి కొలసనకోట గ్రామంలో జరిగే స్వస్థ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన మెడికల్ స్టాల్స్‌ను సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే గర్భిణీలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలియజేస్తూ గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య చికిత్సలో చేయించుకోవాలన్నారు. సకాలంలో మందులు, టీకాలు వేసుకోవడం వల్ల తల్లితోపాటు గర్భస్థ శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణీలను పరీక్షించి వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా 104 నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్వేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లలితమ్మ, సిహెచ్ రజిత కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ సీతమ్మ, నాగరాజ్, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలకు వేతనాలు పెంచాలని ఏఐటియుసి నాయకులు కోటేశ్వరావు కోరారు. స్థానిక గుజ్జుల ఎలమందారెడ్డి స్మారక భవనంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వై.పుల్లమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. యూనియన్ మండల అధ్యక్షురాలు పుల్లమ్మ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ముఖ్యంగా ఉద్యోగ భద్రతను కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 11, 12వ తేదీలలో విజయవాడలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వేతనాలు నెలనెల అందేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి. కొండయ్య, వి.సుబ్బమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాన్ని అడ్డుకోవాలని వినతి

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్ : చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాన్ని అడ్డుకోవాలని రేగలచెలక గ్రామానికి చెందిన రైతు యారవ వెంకటసుబ్బయ్య తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌ను కోరారు. గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులు చెరువులోని మట్టి తీసి పక్కన చేలల్లో నిల్వచేసి ఇటుక బట్టీల వారికి అక్రమంగా అమ్ముకుంటున్నారని తహశీల్దార్‌కు తెలిపారు.

బేకరీలో అగ్ని ప్రమాదం

రూ.90 వేల ఆస్తినష్టం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రధాన రహదారిలో కొలుకుల రోడ్డుకు ఎదురుగా ఉన్న ఎస్ఎల్‌వి బెంగుళూరు బేకరీలో శనివారం గ్యాస్ లీక్ కావడంతో మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల ఉన్నవారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ స్టేషన్ అధికారి పి.మాల్యాద్రి మంటలను అదుపు చేయటంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బేకరీ యజమాని సతీష్‌కి కాళ్లు, చేతులకు గాయాలు అయ్యాయి. రూ.90 వేల నష్టం వాటిల్లిందని బేకరీ యజమాని చెప్పారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి : ట్రాక్టర్ డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా ట్రక్కులోని కర్రలు తగిలి ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం కొండపి మండలంలోని దేవిరెడ్డిపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలం జాళ్లపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ కట్టెలు వేసుకొని కొండపి వస్తోంది. దేవిరెడ్డిపాలెంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట రోడ్డు పక్కన ద్విచక్రవాహనంపై కె.ఉప్పలపాడుకు చెందిన కొప్పోలు మాలకొండయ్య, తాళ్లూరి కోటయ్య ఉన్నారు. కట్టెల ట్రాక్టరు డ్రైవరు నిర్లక్ష్యంగా నడపడంతో ట్రక్కులో కర్రలు తగిలి ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రేమకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారిలో కొప్పోలు మాలకొండయ్య పరిస్థితి విషయంగా ఉన్నట్లు సమాచారం

ప్రకృతి వ్యవసాయంతో లాభం

ప్రజాశక్తి-టంగుటూరు : ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటి అని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని సూరారెడ్డిపాలెంలో ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి మాట్లాడుతూ 360 రోజులు ఏదో ఒక పంట సాగు చేస్తే దిగుబడులు సమృద్ధిగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో యుగంధర్ రెడ్డి, గ్రామ సహాయకులు ప్రభాకర్, అజయ్, సిబ్బంది వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలపై చర్యలు చేపట్టాలి

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీపై ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ గతంలో గూడు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని వైసిపి ప్రభుత్వం చెప్పి ఒక్క సెంటు స్థలానికే పరిమితం చేయడం దారుణమన్నారు. కనీసం 3 సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు అందకపోగా వాటిని బ్యాంకులకు తాకట్టు పెట్టి పైగా నెలవారీ కంతులు చెల్లించాలని పేదలకు నోటీసులు పంపడం విచారకరమని అన్నారు. జగనన్న కాలనీలు ఊరికి దూరంగా ఉండటమే కాకుండా కనిగిరిలో వర్షాకాలం వస్తే చెరువులను తలపించే పరిస్థితి ఉందని అక్కడ పిల్లలు ఈత కొట్టే స్థితి నెలకొందొందన్నారు. దూరప్రాంతాల్లో కేటాయించిన కాలనీలను రద్దు చేసి పేదలకు గ్రామాల్లోనే 3 సెంట్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. రైతుల వద్ద తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి అదే భూములను మూడు రెట్లు ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించి దోపిడీ చేశారని ఆరోపించారు. కనిగిరి నియోజకవర్గంలోనే ఈక్రమంలో సుమారు 18 కోట్ల రూపాయలు ఖర్చు అయ్యాయని తెలిపారు. కనిగిరి మండలంలో 25 గ్రామాల్లో 1795 ఇళ్ల మంజూరు చేయగా కట్టింది కేవలం 64 మాత్రమే అన్నారు. హెచ్ఎంపాడు మండలంలో 803 ఇళ్ల మంజూరు చేసి,

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఒక్కటీ కట్టలేదన్నారు. వెలిగండ్ల మండలంలోని 21 పంచాయతీలకు 1200 ఇళ్ల సాంక్షన్ చేయగా కట్టింది 20 మాత్రమేనని, సిఎస్పురం మండలంలో ల్యాండ్ లెవలింగ్ పై ఖర్చు చేసినా ఇళ్ల కేటాయింపే జరగలేదన్నారు. పిసిపల్లి మండలంలో నిధులను దుర్వినియోగం చేశారన్నారు. జ్యోతిరావు పూలే స్కూల్ నిర్మాణానికి స్థలం అడిగితే నీటి కట్టడాలు ఉన్నాయని చెప్పి నిరాకరించిన అధికారులు, అదే నీటి కుంటల్లో సమాధిల్లో జగనన్న లే అవుట్లు కేటాయించడం ఆశ్చర్యకరమని ఎమ్మెల్యే విమర్శించారు. యడవల్లి పంచాయతీలో ప్రజలకు 1 సెంట్ స్థలం ఇచ్చి, నాయకులు మాత్రం 3 సెంట్లలో ఇళ్ల కట్టుకోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

మాట్లాడుతున్న రైతు నాయకులు జె జయంతిబాబు

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఎపి రైతు సంఘం మండల 2వ మహాసభ జి సత్యం అధ్యక్షతన శంకరాపురంలో శనివారం నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె జయంతి బాబు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ విధి విధానాలు మార్చడంతో రైతులే నగదు చెల్లించేలా మార్పులు చేశారని అన్నారు. పిపిపి పద్ధతిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు అభివృద్ధి చేస్తామని అధానికి 2లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లు ఇచ్చిందని, గత నెలలోనే 5.75లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల ఎఫ్సిఐ గోడౌన్లను అదానికి 30ఏళ్లకు లీజుకు ఇచ్చారని అన్నారు. సహకార వ్యవస్థలో లోపాలు సవరించి రైతుల ప్రయోజనాలు కాపాడేవిధంగా లేదని అన్నారు. సహకార వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం కబంధ హస్తల్లోకి తీసుకొని రైతులను నట్టేట ముంచుతుందని అన్నారు. కార్పొరేట్ల కబంధహస్తాల్లోకి వ్యవసాయ రంగం వెళ్లిందని అన్నారు. సరళీకరణ విధానాల వల్ల తీవ్రమైన సంక్షోభానికి గురైందని, పెట్టిన పెట్టుబడులు తిరిగిరాక రైతాంగం అప్పులపాలయ్యారని అన్నారు. ఈ కాలంలో 4లక్షల మంది రైతులుపైగాచనిపోయారని అన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, బి హనుమంతరావు, వి ఆంజనేయులు, ఎర్రయ్య, తిరుపతిరావు, మీరావలి, రమేష్, రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటస్వామి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పర్చూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు శనివారం నిర్వహిచారు. స్థానిక పంచాయతీ, ఎంపిడిఒ కార్యాలయాల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలపారు. వర్షాకాల సీజన్లో త్రాగే నీటి ద్వారా వచ్చే వ్యాధుల పట్ల, దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నుండి జాగ్రత్తలు వహించాలని సూచించారు. పంచాయతీల్లో పారిశుధ్యం ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. మురుగు నీటి కాలువలో పూడికలు తీయాలని, బ్లీచింగ్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కొసనా సత్యనారాయణ, కార్యదర్శి ఎం మస్తానరావు, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరావు, ఎఒ ఎ శకుంతల, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు రుణాలు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా నేషనల్ అర్బన్ ఎల్ మిషన్ 2.0 ద్వారా పట్టణంలో వీధి విక్రయదారులు 700 మందిని కొత్తగా గుర్తించాలని, అదేవిధంగా వారికి ఐడి కార్డులు ఇచ్చి వారికి బ్యాంకుల ద్వారా పిఎం స్వానిధి స్కీం ద్వారా మొదటి విడతలో రూ.15వేలు, రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేలు రుణాలు మంజూరు చేస్తున్నట్లు కమిషనర్ డి రవీంద్ర తెలిపారు. వీరికి 7శాతం వడ్డీ రాయితీ ఉంటుందని అన్నారు. మొదట విడత తీసుకున్న వారికి రెండవ విడత రుణాలు, రెండో విడత తీసుకున్న, తీసుకొని కట్టిన వారికి మూడో విడత రుణాలు 2.0 క్రింద రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాపట్ల గోల్డెన్ శాండ్ రిసార్ట్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యాటక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఎపి టిడిసి చైర్మన్ బాలాజీలతో కలసి బాపట్లలోని గోల్డెన్ సాండ్ రిసార్ట్‌ను వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. మండలంలోని పాండురంగాపురం సమీపంలోని బాపట్ల గోల్డెన్ సాండ్ రిసార్టులో కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడు, ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు సలీమా పాల్గొన్నారు.



రిసార్టును ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

తీర ప్రాంత అభివృద్ధికి సహకరించాలి

అసెంబ్లీ సమావేశాల్లో శాసన సభ్యులు కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంత అభివృద్ధితో పాటు పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించాలని శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రస్తావించారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా చీరాల బీచ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై దృష్టి సారించారు. వాడరేవు, రామాపురం వంటి తీరప్రాంతాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తున్నారని గుర్తు చేశారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుంటారని అన్నారు. పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం తగిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. తీరప్రాంత రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించారు. తీరంలోని సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా ఆధునికీకరించేందుకు చేపట్టిన పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని కోరారు. బాపట్ల మండలం సూర్యలంక, వాడరేవు బీచ్‌లను అనుసంధానించే రహదారి ఏర్పాటుకు కలెక్టర్ ఇప్పటికే ఆమోదం తెలిపారని, ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే తీరప్రాంత అభివృద్ధి దిశగా ముందడుగు వేసినట్లు అవుతుందని అన్నారు. ఇక పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున చీరాల తీర ప్రాంత అభివృద్ధి అంశం సభలో ప్రస్తావించటం అభినందనీయమని అన్నారు. చీరాల సముద్ర తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇందుకు ఇప్పటికే నిధులు మంజూరు చేశామని తెలిపారు. తీరప్రాంత పర్యాటక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. మంత్రి సమాధానానికి స్పందించిన ఎమ్మెల్యే కొండయ్య చీరాల తీర అభివృద్ధికి అన్ని విధాల సహకరించాలన్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో చీరాల అభివృద్ధికి పలు అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఫైర్ ఆఫీసర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్, కుందేరు వాగు ప్రక్షాళన అంశాలు ప్రస్తావించిన ఆయన నేడు పర్యాటక రంగ అభివృద్ధి అంశాన్ని సభలో లేవనెత్తడం అభివృద్ధికి ఆయన కృషి పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

దేవస్థానం బోర్డు సభ్యుడిగా నాగేశ్వరరావు

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు సభ్యులు జివి నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - రేపల్లె

తెలుగుదేశం చేనేత విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నాగేశ్వరరావు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమితులైన సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జి శ్రీనివాసరావు, కృష్ణ పశ్చిమ డెల్టా సాగునీటి సంఘాల చైర్మన్ పి మురళీధరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు మేక రామకృష్ణ, మాజీ అధ్యక్షులు పట్టాభిరామారావు, శివ సుబ్రహ్మణ్యం, ధర్మతేజ, రవిశంకర్, సూర్యరాజు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు టి మల్లికార్జునరావు, తెలుగు యువత అధ్యక్షులు సలీం, కొలసాని రాము, టి సాయిబాబు, తెలుగు మహిళ ప్రతినిధులు, అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు ఆయనను ఘనంగా సత్కరించారు. నిజాంపట్నం ఫైబర్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, టిడిపి నాయకులు నాయుడు గోపి, టిడిపి నిజాంపట్నం అధ్యక్షులు దండుప్రోలు వెంకటేశ్వరరావు, కూచినపూడి ఎఎంసి చైర్మన్ ఓ వెంకట్ యాదవ్, నగరం మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జడ్పిటిసి మేక శివరామకృష్ణ, టిడిపి నగరం అధ్యక్షులు చింతల సుబ్బారావు, చెరుకుపల్లి టిడిపి అధ్యక్షులు తాత ఏడుకొండలు, టిడిపి బీసీ సెల్ కార్యదర్శి దివి రాంబాబు, చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కందుల వెంకటేశ్వరరావు, నూకాలమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ వంగర శ్రీనివాసరావు, పేటేరు టిడిపి అధ్యక్షులు గోలి రామ శేషగిరిరావు, మాజీ ఉపసర్పంచ్ డివిఎస్ఆర్ శాస్త్రి, దివి ధనుంజయరావు, టిడిపి రేపల్లె అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కె వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తాను అందిస్తున్న సేవలు గుర్తించి కనకదుర్గమ్మ దేవస్థానం పాలక మండలిలో స్థానం కల్పించిన సిఎం చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, మంత్రి అనగాని సత్యప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన జివి నాగేశ్వరరావు

చంద్రబాబుతో ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధికి చంద్రబాబు భరోసా

ప్రజాశక్తి - చీరాల

సిఎం చంద్రబాబు చీరాల నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని భరోసా ఇచ్చారని ఎంఎల్ఎ కొండయ్య తెలిపారు. శాసన సభ సమావేశాలు ముగిసిన అనంతరం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక రాజకీయ పరిస్థితులు, తదితర అంశాలను సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. చీరాల పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు, కుందేరు వాగు ప్రక్షాళన, చేనేత టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ ప్రతిపాదన, తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించడం వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాల విషయాన్ని సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం చీరాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. చీరాల ప్రాంతం తెలుగుదేశంకు కంచుకోటగా నిలుస్తుందని పేర్కొన్నారు. బీసీలు అధికంగా ఉండే ఈ ప్రాంత అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. స్థానిక చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, ప్రతిపాదిత టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిభిరంలో 35 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 16 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ణయించినట్లు రోటరీ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. ఆపరేషన్ కోసం ఎంపిక చేసిన వారిని ఆదివారం గుంటూరు పెదకాకాని శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్బు ఆధ్వర్యంలో ప్రతినెల చివరి శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కాఆపరేషన్లు చేయిస్తున్నామని అన్నారు. ఈ ప్రాంతంలోని వేలాదిమంది పేదలకు రోటరీ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు ఈపాటికి జరిపామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి నెల వైద్య శిభిరం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. రోగులను డాక్టర్ శ్రద్ధ లాజర్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ షేక్ కాలేషావలి, చిలుకూరి వీర రాఘవయ్య, కరణం హనుమంతరావు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, పిఆర్ఓ బి సైదులు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పావులూరుకు చెందిన పొట్లూరి హనుమాయమ్మ (85) అనారోగ్యంతో చనిపోగా ఆమె కళ్ళను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్య సేవ వైద్యులు వచ్చి ఆమె కంటి కార్నియాలు శనివారం సేకరించారు. కుటుంబ సభ్యులు రామచంద్రరావు, ఏడుకొండలు, పవన్ కుమార్, శాంతమ్మను రోటరీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి అభినందించారు.

హనుమాయమ్మ

ఆగని గంజాయి అక్రమ రవాణా

పోలీసుల తనిఖీల్లో బయట పడుతున్న వైనం

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

గంజాయి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ రవాణకు బ్రేకులు పడటం లేదు. ఒంగోలు రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించిన ప్రతిసారీ కిలోల కొద్ది గంజాయి పట్టుబడుతూనే ఉంది. గత రెండు నెలల కాలంలో దాదాపు 8 సార్లు తనిఖీలు నిర్వహించగా భారీ ఎత్తున గంజాయి గంజాయి లభ్యమైంది. రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకి పంపుతున్నటికీ గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం గంజాయి ఉత్పత్తి, వినియోగాన్ని ఓ సామాజిక సమస్యగా గుర్తించింది. దీని ద్వారా అనేకమంది అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారని, ముఖ్యంగా విద్యార్థులు యువత గంజాయికి బానిసలుగా మారి తమ జీవితాలు నాశనం చేసుకున్నట్లు గుర్తించారు. నేరాలు, మహిళలపై హింసలో గంజాయి పాత్ర ఎక్కువగా ఉన్నట్లు

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పట్టుబడిన గంజాయి

అనేక నివేదికలు చెబుతున్నాయి. ఈ కారణాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వం గంజాయిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో 'ఈగల్' పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది.

గంజాయి ఉత్పత్తి మూలాలపై దష్టి సారించాలి

గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపుతున్న జిల్లా పోలీసులు దాని ఉత్పత్తి మూలాలపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఇతర జిల్లాల పోలీసులు, ఇతర రాష్ట్రాల పోలీసులు మరియు గంజాయి ఉత్పత్తి, రవాణా నిరోధానికి ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమన్వయంతో పనిచేయాలి. అప్పుడే అసలు గంజాయి ఉత్పత్తి ఎక్కడ జరుగుతుంది? ఎవరు చేస్తున్నారు? రవాణా చేస్తున్న వారిలో ఏ ప్రాంతాల వారు ఎక్కువగా ఉన్నారు? వారి యొక్క సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆరా తీయాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా కేవలం రవాణాపై నిఘా పెట్టినంత మాత్రాన గంజాయి సమస్యను పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదు. నూతన ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్ రాజు ఈ సమస్యపై ప్రత్యేక దష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకూ గుర్తించిన గంజాయి కేసులను విశ్లేషించి, వాటిలోని కీలక అంశాలను గుర్తించాలి. వాటి ఆధారంగా జిల్లా పోలీసులు సమగ్ర విచారణ జరిపి వచ్చిన నిర్ధారణల మేరకు కార్యాచరణ చేపట్టాలి. అప్పుడే గంజాయి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

'డిజిటల్ బుక్'తో కార్యకర్తలకు భరోసా : వైసిపి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వైసిపి కార్యకర్తలకు అండగా నిలిచి, వారిపై జరిగే అన్యాయాలను ఎదుర్కొనే వేదికగా డిజిటల్ బుక్ దోహద పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. వైసిపి జిల్లా కార్యాలయంలో వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇటీవల ప్రారంభించిన డిజిటల్ బుక్‌ను ఆ పార్టీ నేతలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి , ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు మాట్లాడుతూ డిజిటల్ బుక్ ద్వారా ప్రతి కార్యకర్త ఎదుర్కొనే ఇబ్బందులు, అన్యాయాలు, కష్టాలు నేరుగా నమోదయ్యే అవకాశం లభిస్తుందన్నారు.కార్యకర్తల రక్షణలో, వారి హక్కుల సాధనలో ఇది కొత్త మైలురాయిగా నిలుస్తుందని

రెడ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి బలమని, కార్యకర్తలకు అండగా నిలవడం పార్టీ నిబద్ధతగా పేర్కొన్నారు. గత ఏడాదిన్నర కాలంలో కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులు పెరిగాయన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు డిజిటల్ ప్లాట్ ఫామ్ ఉపకరిస్తుందన్నారు.డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సమస్యలు పారదర్శకంగా వెలుగులోకి వస్తా యన్నారు. వాటి పరిష్కారానికి పార్టీ తక్షణమే చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. కేవలం ఓ రాజకీయ పార్టీగా కాకుండా, కార్యకర్తల హక్కులను కాపాడే సామాజిక కర్తవ్యంగా పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కసుకుర్తి ఆదెన్న , వై. వెంకటేశ్వరరావు , నగర అధ్యక్షుడు కటారి శంకర్ , బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, జిల్లా నాయకులు దాసరి కరుణాకర్, రొండా అంజిరెడ్డి, తాత నర్సింహగౌడ్, దేవరపల్లి అంజిరెడ్డి, దేవా, వేముల శ్రీకాంత్, పులుసు సురేష్, పిగిలి శ్రీనివాసులు, సురేందర్ రెడ్డి, కూనం గౌతమ్, పెట్లూరి ప్రసాద్, పణిదెపు సుధాకర్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పిపిపి పేరుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటికరించే ప్రక్రియను ఉప సంహరించుకోవాలని కోరుతూ వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజా హక్కులను కాపాడాల్సిన పాలకులు కార్పొరేట్ల ప్రయోజనం కోసం వాటిని కాలరాస్తున్నట్లు విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిచాల్సిన ప్రభుత్వాలు వాటిని ప్రజలకు దూరం చేస్తున్నట్లు ఆరోపించారు.వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం వెనుక కార్పొరేట్ల ప్రయోజనం మాత్రమే ఉందన్నారు. . వైద్య కళాశాల ప్రభుత్వ రంగం లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించకపోతే, ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ వెళ్లి జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు ధర్నాసి

జేసికి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

హరిబాబు, కొండపి నియోజకవర్గ అధ్యక్షుడు దారా మాధవరావు, మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడు భూపని కాశయ్య, యర్రగొండపాలెం అధ్యక్షుడు ఎం. సుబ్బారెడ్డి, ఒంగోలు సిటీ అధ్యక్షుడు కాకుటూరి సంపత్ కుమార్, సీనియర్ న్యాయవాదులు నల్లమలపు సుబ్బారెడ్డి, చావలి రమేష్ బాబురావు, కాకుటూరి బాబూరావు, జిల్లా లీగల్ కమిటీ సభ్యులు భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, పెళ్లూరు రామకృష్ణ, ధర్నాసి రామారావు, గల్లి చౌడేశ్వరరావు, యేరువ వెంకటేశ్వరరెడ్డి, సమాచార హక్కు చట్ట విభాగం ప్రతినిధులు తోట సుధారాణి, కె. శేషారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు షేక్ హిదయ్యతుల్లా, హనుమంతు నిపాడు ఎంపిపి గాయం సావిత్రి, పొదిలి న్యాయవాది గాదె సుజాత పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలతో పాటు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యా యులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ఉపా ధ్యాయులు కొని యాడారు. కొత్తపట్నం హైస్కూల్ విద్యార్థులకు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆర్‌టిసి బస్సు పాస్‌లు అందజేశారు. ఒంగోలు లోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో జరిగిన కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ చాపల వంశీ కష్ణ, డాక్టర్ చాపల శాంత కుమారి ఉచిత బస్సు పాసులను కొత్తపట్నం హైస్కూల్ ప్రధానోపా ధ్యాయులు బలిశెట్టి శ్రీనివాసరావుకి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ ఉచిత బస్సు పాసులతో విద్యార్థులు ప్రతి రోజూ క్షేమంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి నుంచి స్కూల్ కు తిరిగి స్కూల్ నుంచి ఇంటికి రావడానికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పిల్లలు

బస్సు పాసులు అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

స్కూలు మానేయకుండా ఉండడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రధానోపా ధ్యాయులు శ్రీనివాస రావు మాట్లా డుతూ డాక్టర్ చాపల వంశీకష్ణ దంపతులు పేద ప్రజలకు వైద్య పరంగానే కాకుండా, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు బహూ కరిస్తు న్నారన్నారు. శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల ద్వారా ట్యూషన్లు చెప్పించడం, శ్రీరామ్ ఆరోగ్య రక్ష కార్డు ద్వారా పేద విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

కావూరి సుబ్బారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సీనియర్ పాత్రికేయులు కావూరి సుబ్బారావు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కీర్తిశేషులు కావూరి సుబ్బారావు ఐదో వర్ధంతి ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంతపేటలోని శివం శరణాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావూరి సుబ్బారావు చిత్రపటానికి ఆయన కుమారుడు కావూరి నవీన్, పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన వ్యక్తి కావూరి అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.భక్తవత్సలం మాట్లాడుతూ నిబద్ధతగల జర్నలిస్టు కావూరి సుబ్బారావు అని కొనియాడారు. వార్తలను ఉన్నది ఉన్నట్టుగా నిర్భయంగా రాసే కావూరి మంచి విలువలు గల జర్నలిస్టు అని, ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలకు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం శివం శరణాలయంలో వృద్ధులకు, శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలో 300 మంది పేదలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు జి. రమేష్. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు టి.భక్త సింగ్ రాజు. బత్తుల ముసలారెడ్డి. ఐద్వా నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి. డాక్టర్ వి. మాలకొండయ్య. మెజిషియన్ బివి.రామన్. దన్నారపు మస్తాన్‌రావు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు 20 శాతం షాపులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ ఆవరణలో నిర్మించనున్న జి4 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు 20 శాతం షాపులు కేటాయించాలని ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ కోరారు. ఈమేరకు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజన్ మాదిగ మాట్లాడుతూ ఒంగోలు నగర సర్వే నెంబర్ 77లో 83 సెంట్ల ఖాళీ స్థలంలో 110 షాపులు నిర్మించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. పాత మార్కెట్ ని నమ్ముకొని ఎస్‌సి, ఎస్‌టి, నిరుపేద స్వశక్తి సంఘా మహిళలు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగి స్తున్నారన్నారు. కొత్తగా నిర్మించే కాంప్లెక్స్ తీర్మానంలో ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్ అంశాన్ని చేర్చకుండా తీర్మానం చేయటం సహేతుకం కాదని జేసఅఈ దష్టికి తీసుకువచ్చారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) పద్ధతిన నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయా వర్గాలకు 20 శాతం షాపులు కేటాయించేలా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవోలు ఉన్నాయన్నారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్‌సి, ఎస్‌టిలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు 20 శాతం షాపులు కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన సంయుక్త కలెక్టర్ గోపాలకష్ణ మాట్లాడుతూ తప్పనిసరిగా షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు అవకాశాన్ని కల్పించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎంసి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె.త్యాగరాజు, ఎంఎస్‌పిఎస్ నాయకులు పత్రా బంగారం, ఒంగోలు నగర యాదవ జెఎసి అధ్యక్షుడు డి.అప్పారావు, ఎంఎస్‌పిఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు తేళ్ల జయరాజ్, కత్తి శేషారావు పాల్గొన్నారు.

చెక్కులు అందిస్తున్న శివన్నారాయణ

ప్రమాద బీమా చెక్కులు అందజేత

ప్రజాశక్తి - బాపట్ల

జనసేన సభ్యత్వం కలిగిన ఇరువురు రహదారి ప్రమాదంలో మరణించడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రమాద భీమా ద్వారా ఒక్కొక్కరి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ శనివారం అందజేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసేన సభ్యులైన కర్లపాలెం మండలానికి చెందిన మరక రాజు, బి హరీష్ కుటుంబాలకు భీమా చెక్కులు అందజేశారు.

బాలకృష్ణ ఫ్లెక్సీ దగ్ధం చేస్తున్న రామయ్య

బాలకృష్ణను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - బాపట్ల

అసెంబ్లీలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సైకోగా అభివర్ణించిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని నినాదాలు చేస్తూ వైసిపి వికలాంగుల విభాగం జిల్లా నాయకుడు చల్లా రామయ్య బాలకృష్ణ ఫ్లెక్సీని దగ్గం చేశారు. స్థానిక రథం బజార్లో ఫ్లెక్సీని దగ్ధం చేసి బాలకృష్ణ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ రాంబాబు తమ సిబ్బందితో రామయ్యను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విధమైన చర్యలకు పాల్పడకుండా రామయ్యపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఉపాధి హామీ పనులు త్వరితగ తిన పూర్తి చేయాలని డిడబ్ల్యుఎంఎ పిడి గంగవరపు జోసఫ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మారెళ్ళ, శంకరాపురం, వేములబండ, రమణరెడ్డిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. శంకరాపురం పంచాయతీలో పల్లె పుష్కరిని కింద చెరువుగట్లను పరిశీలించారు. చెరువు గట్టును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చుట్టూ రెండు వైపులా మొక్కలు నాటాలని అన్నారు. చెరువు అభివృద్ధి పనుల్లో గ్రామస్తులు భాగస్వాములు కావాలని అన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు, ఉపాధి సిబ్బంది పనిచేయాలని చెప్పారు. మారెళ్ళలో అవెన్యూ ప్లాంటేషన్ కింద 2వేల మొక్కలు నాటేందుకు రోడ్లను పరిశీలించారు. వేములబండ పంచాయతీలోని రమణారెడ్డిపాలెంలో మ్యాజిక్ డ్రైన్లను పూర్తి చేసి ఇంట్లో నుండి వచ్చే నీరు ద్వారా కాలువలకు పంపించే ఏర్పాటు చేయాలని పిఆర్ఎఈని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి పంచాయతీలో 25 సోప్ ఫిట్స్ పూర్తి చేయాలని అన్నారు. పనుల నిర్వహణలో నాణ్యత పాటించాలని చెప్పారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ ఎస్‌కె అబ్దుల్ రహీం, ఈసి శివరామకృష్ణ, టీయేలు భారతీ, నాగార్జున, శ్రీనివాసులు, టిడిపి అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సర్పంచి కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే గ్రామసభలు

మాట్లాడుతున్న తహశీల్దారు జె ప్రభాకరరావు

ప్రజాశక్తి - చిన్నగంజాం

గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి సచివాలయంలో తహశీల్దారు జె ప్రభాకరరావు ఆధ్వర్యంలో రీసర్వే గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రధాన ఉద్దేశ్యం గ్రామంలో ఎటువంటి భూ వివాదాలు, సమస్యలు లేకుండా రైతులకు న్యాయం చేయడమేనని స్పష్టం చేశారు. గ్రామ సభలో ఆయన రైతులకు రీ సర్వే ప్రక్రియ వివరించారు. రైతులు తమ సమస్యలు స్వయంగా అధికారుల ముందుంచుకోవాలని అన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా గ్రౌండ్ ట్రూథింగ్ సమయంలో రైతులు తప్పనిసరిగా తమ హక్కు పత్రాలు, ఆధార్, ఫోటో తదితర పత్రాలతో భూమి వద్ద హాజరవ్వాలని తెలిపారు. సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కారం చూపేందుకు రీ సర్వే ప్రక్రియ ఉపయోగపడుతుంది చెప్పారు. రీ సర్వేపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రీసర్వే డిటి సుజాత, మండల సర్వేయర్ లోకేష్, దానియేలు, విఆర్ఓలు అమంచి సత్యనారాయణ, ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

అద్దంకి : మండలంలోని మణికేశ్వరంలో భూ రీసర్వేకు సంబంధించి గ్రామ సభ శనివారం నిర్వహించారు. సభలో తహశీల్దారు శ్రీచరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ, వాణిజ్య భూములకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ పాత సర్వే రికార్డుల ప్రకారమే లావాదేవీలు కొనసాగేవని, సింగిల్ ఎల్‌పిఎంలకు బదులు జాయింట్ ఎల్‌పిఎంల వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించిందని తెలిపారు. జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)ల స్థానంలో సింగిల్ ఎల్‌పిఎంలు కేటాయించేందుకు నిర్ణయించిందని అన్నారు. టిడిపి నేత షేక్ కరిముల్లా మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గురైన భూముల వివరాలు సింగిల్ ఎల్‌పిఎం లేకపోవడంతో రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు కావడం లేదని గత వైసిపి సర్కారు భూముల రీ సర్వే నిర్వాకంతో నానా యాతన పడుతున్న అన్నదాతలకు కూటమి ప్రభుత్వం ఊరటనిచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిపి నాయకులు షేక్ బడావలి, మౌలాలి, ఆదినారాయణ, మాధ్యూస్, వర్ధన్, ఆర్ఐ శంకర్, సర్వేయర్, విఆర్ఓ ఉన్నారు.

కొల్లూరు : రీ సర్వేలో భాగంగా జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం తహశీల్దారు బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిలుమూరు, రావికంపాడులో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తాశీల్దారు ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అద్దంకి తహశీల్దారు శ్రీచరణ్

మాట్లాడుతున్న తహశీల్దారు బి వెంకటేశ్వర్లు

పోలీసులు తీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో కీలకంగా ఉన్నారనే కారణంతో ఇద్దరు దళిత యువకులపై ఫ్లెక్సీలు చించారని టిడిపి నాయకులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో సీఐ మాదినేని శేషగిరిరావు దళిత యువకులను విచారణ పేరుతో పోలీసు స్టేషన్‌కు పిలిపించి అమానుషంగా కొట్టడం పోలీసు వ్యవస్థకే అవమానమని వైసిపి ఇన్‌ఛార్జ్ గాదె మధుసూదనరెడ్డి విమర్శించారు. మండలంలోని దేగరముడిలో టిడిపి నాయకుల ప్రమేయం లేకుండా దళిత యువకులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో గత కొద్ది రోజులుగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అయితే ఈ నెల 26న గ్రామానికి చెందిన అల్లాడి ప్రమోద్ కుమార్, పోతులూరి జ్యోతి అనే దళిత యువకులను టిడిపి ఫ్లెక్సీలు చించారని గ్రామానికి చెందిన కొంతమంది ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ ఆ యువకులను స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టడంతో గాయపడి నడవలేని స్థితిలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో ఆ యువకులు చికిత్స పొందుతున్నారని అన్నారు. సమాచారం తెలుసుకున్న ఆయన జంపని వీరయ్య చౌదరి, స్థానిక వైసీపీ నాయకులతో కలిసి హాస్పిటల్‌లో ఉన్న ఇద్దరు దళిత యువకులను పరామర్శించారు. హాస్పిటల్‌లో వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. అధికార పార్టీ నాయకుల అండ చూసుకొని తమ పరిధి దాటకూడదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంత మంది పోలీసులు ఇదే తీరున వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికారం శాశ్వతం కాదన్న సంగతి పోలీసులు గుర్తుంచుకోవాలని అన్నారు. దళిత యువకులపై సీఐ వ్యవహరించిన తీరును వైసీపీ అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి మధుసూధనరెడ్డి

అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజం

ప్రజాశక్తి - చిన్నగంజాం

మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలైన బాధితుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం చేపట్టిన మద్యం అవగాహన, ప్రతిస్పందన విద్యా కమిటీ స్థానిక డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ, వైద్యులు, పోలీసు విభాగం, సామాజిక సంక్షేమ శాఖ ప్రతినిధులు మత్తు పదార్థాల వల్ల కలిగే హానికర ఫలితాలపై అవగాహన కల్పించారు. కేర్ కమిటీ జిల్లా కన్వీనర్ బి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మద్యపానం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలు వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబానికి, సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. యువత భవిష్యత్తు ఈ పదార్థాల వలన చీకటిలోకి నెట్టబడుతుందని తెలిపారు. వారిని మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని అన్నారు. భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. డిపిఇఓ ఎఫ్ఎసి పి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల నుంచే విద్యార్థుల్లో మద్యపానానికి వ్యతిరేక దృక్పథాన్ని పెంచాలని సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చీరాల ఇన్స్‌పెక్టర్ ఎస్ రామారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమ మద్యం, డ్రగ్స్ విక్రయం, వాడకం అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డాక్టర్ పి పద్మావతి, డాక్టర్ జిపి సాయిశ్రీ చరణ్, సిహెచ్ సైదారెడ్డి, సయ్యద్ నాగూర్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బి వెంకటేశ్వర్లు

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న అమ్మ ఆశ్రమంలో అధ్యక్షులు గుంటుపల్లి చందు ఆధ్వర్యంలో చిలకలూరిపేట ఫ్రెండ్లీ హాండ్స్ ఆర్గనైజషన్ సహకారంతో ఎస్‌వి డెంటల్ వైద్యశాల డాక్టర్ సుధారాణి దంత వైద్యశిబిరం నిర్వహించారు. 50 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్లీ హాండ్స్ ఉపాధ్యక్షురాలు జి భాగ్యలక్ష్మి, కార్యదర్శి స్నేహ, రవి, అచ్యుత్ పాల్గొన్నారు.

డిజిటల్ యాప్ గోడ ప్రతుల ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసిపి కార్యకర్తలు, నాయకులపై రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన డిజిటల్ యాప్ గోడ ప్రతుల ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. వైసిపి కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. వైసిపి కార్యకర్తలు కూటమి ప్రభుత్వం నాయకులు ద్వారా తాము ఎదుర్కొంటున్న సమస్యలను యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చిన్నిపోతుల హరిబాబు, కొక్కిలిగడ్డ చెంచయ్య, నక్క వీరారెడ్డి, మాల్యాద్రి, జోగి రాజా, వడ్డీముక్కల డేవిడ్, కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రోశయ్య వియ్యంకుడు మృతి

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొంజేటి రోశయ్య వియ్యంకుడు చీదేళ్ళ సత్యనారాయణ (92) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు రైలుపేట హిందూ స్మశాన వాటికలో నిర్వహించారు. ఆయన మృతికి పలువురు రాజకీయ ప్రముఖులు, పట్టణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వ్యాపార సంస్థలు, సంఘాల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

రైల్వే స్టేషన్లో ఈగల్ టీం, పోలీసుల సోదాలు

- పూరీ ఎక్స్ ప్రెస్‌లో 16 కేజీల గంజాయి పట్టివేత
- గంజాయి ప్యాకెట్లు సీజ్ చేసిన పోలీసులు
- పోలీసులు అదుపులో అనుమానితులు

వివరాలు వెల్లడిస్తున్న ఈగల్ టీం అధికారి రాంబాబు

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాపై ప్రతిష్టాత్మక చర్యలు చేపడుతున్న గంజాయి అక్రమ రవాణా, మాఫియా దళారులు రెచ్చిపోతున్నారు. అక్రమ రవాణాదారులపై ఉక్కు పాదం మోపేందుకు ఈగల్ టీం, రైల్వే పోలీసులు రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారమ్‌లు, ప్రయాణికుల లగేజీ కవర్‌చేస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పూరీ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేశారు. పోలీసులు ప్రయాణికుల సామాన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాగులను చెక్ చేస్తూన్న సమయంలో 16 కేజీల గంజాయి ప్యాకెట్లు బ్యాగుల్లో బయటపడటంతో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగుల్లో దాచిన నిషేధిత మత్తు పదార్థం గంజాయి 16 కేజీలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఈ సందర్భంగా ఈగల్ టీమ్ నోడల్ అధికారి రాంబాబు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను ఏ మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. గంజాయి మాఫియాను అరికట్టేందుకు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైళ్లలో ప్రయాణికుల సామాన్లను డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. గంజాయి రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఈ వ్యాపారంలో పాల్గొంటే శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో రైల్వే పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో రైళ్లు, స్టేషన్లలో అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైళ్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రయాణికులు అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులను గమనించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో ఈగల్ టీం, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

మహోత్సవాల్లో పాల్గొన్న సమ్మెట కోటేశ్వరరావు దంపతులు

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - నగరం

నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మండలంలోని పెద్దపల్లికి చెందిన తెలుగుదేశం నాయకులు సమ్మెట కోటేశ్వరరావు (వంశి), వెంకట భవాని దంపతులు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మెట కోటేశ్వరావు దంపతులకు స్థానిక తహశీల్దారు నాంచారయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురు స్వాములు కేశన మురళీకృష్ణ, మోర్ల శ్రీనివాసరావు, జుజ్జూరు బాబు, ఎల్లాప్రగడ సీతాపతి, జొన్న శివ సాంబయ్య, చింతల వెంకట శేషసాయి ప్రసాద్, మరక సాయి నాగరాజు, యార్లగడ్డ చింతయ్య, తాడివాక హరిప్రసాద్, మట్ట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేస్ట్ టు ఆర్టును తిలకించిన కలెక్టర్ దంపతులు

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి కార్యక్రమాలు చేపడుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం పార్కులో ఉపయోగంలో లేని టైర్లకు రంగు రంగులతో అలంకరించి మొక్కలతో నింపండం ద్వారా పూల గుత్తులు అందరి దృష్టిని ఆకర్షించే విధంగా అలంకరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వరకు జరిగే స్వచ్ఛతహై సేవ కార్యక్రమంలో భాగంగా రథం బజార్లో గాలిగోపురం ఎదురు క్లీన్ గ్రీన్ ఉత్సవ్‌లో వేస్ట్ టు ఆర్ట్ రంగవల్లికను కలెక్టర్ వి వినోద్ కుమార్ దంపతులు తిలకించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, డిఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, టిపిఒ ఎస్ మల్లికార్జునరావు, ఆర్ఒ అబ్దుల్ జబ్బార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు నజీర్, కరుణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పిఎసి సమావేశంలో ఆమంచి

ప్రజాశక్తి - వేటపాలెం

షర్మిలను కలిసిన మాజీ ఎంఎల్ఏ ఆమంచి కృష్ణమోహన్

కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యల పరిష్కారం అంశాలపై విస్తృత చర్చలు జరిపిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం విజయవాడలోని కేంద్ర కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి అధ్యక్షత వహించారు. ఆమె నేతృత్వంలో జరిగిన సమావేశంలో చీరాల మాజీ శాసన సభ్యులు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని కీలక సూచనలు చేశారు. పార్టీ బలోపేతంపై కార్యకర్తలను చురుకుగా తీర్చిదిద్దే అవసరాన్ని ప్రత్యేకంగా చెప్పారు. కాంగ్రెస్ పాత బలమైన స్థావరాలపై మళ్లీ దృష్టి సారించాలని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారం ద్వారానే ప్రజలకు చేరువ కావచ్చని అభిప్రాయపడ్డారు. రాబోయే రాజకీయ పరిణామాలు, తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాతిపదికన బలపర్చడం కోసం మద్దతుదారుల సమీకరణ, గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక వ్యూహ రచన చేయాలని సూచించారు. కాంగ్రెస్‌ను రాష్ట్రంలో మళ్లీ ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన ఆర్గనైజేషనల్ రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. అన్ని వర్గాల నేతలు, కార్యకర్తలు ఏకతాటిపై పనిచేయాలని చర్చలు జరిగినట్లు సమాచారం. కాంగ్రెస్ బలోపేతం కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై ఆందోళనల రూపంలో నిలబడేలా కార్యాచరణ నిర్ణయించినట్లు తెలిసింది.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సిహెచ్ సురేష్‌బాబు

క్రీడలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అద్దంకి

రెవిన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరు సౌజన్యంతో బాపట్లలో అక్టోబర్ 10, 11 తేదీల్లో జిల్లా స్థాయి రెవిన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో రెవిన్యూ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి, సంతమాగులూరు, జె పంగులూరు తహశీల్దారులు జి చరణ్, కె రవిబాబు, పి సింగారావు క్రీడల బ్రోచర్ ఆవిష్కరించారు. విఆర్ఎ నుండి డిప్యూటీ కలెక్టరు వరకు రెవిన్యూ ఉద్యోగులు అందరూ రెండు రోజులు ఆనందంగా గడిపేలా ఈ క్రీడలు నిర్వహించాలని తెలిపారు. క్రీడోత్సవాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షులు చీరాల తహశీల్దారు కె గోపికృష్ణ, డివిజన్ కార్యదర్శి పీకా సురేష్ మాటాడుతూ క్రీడల్లో పాల్గొనే వారి జాబితా సిద్ధం చేసే భాద్యత ఆయా మండలాల తహశీల్దార్లు తీసుకోని జాబితా తయారు చేసి డివిజన్ కమిటీకి అందచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిహెచ్ సురేష్ బాబు, జిల్లా క్రీడల కార్యదర్శి డి అర్జున్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు డి శ్రీకాంత్, రామకృష్ణ, అద్దంకి ఆర్ఐ శంకర్, ఎఎస్ఓ అమరనాథ్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న బాధితులు, దళిత నేతలు

ఇల్లు కూల్చేస్తామని బెదిరింపులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తమ ఇంటిని కూలగొడతామంటూ బెదిరిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం నాయకులు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఒంగోలు కలెక్టరేట్ వద్ద దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలసి శనివారం ధర్నా చేశారు. నగరంలోని నెహ్రూ కాలనీకి చెందిన ఈద జాస్మిన్ గత 20 ఏళ్ళ నుండి డికె ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఇంటి పన్ను, కొళాయి పన్ను, విద్యుత్ మీటర్ ఉండి పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని అన్నారు. టిడిపి నాయకుడు పసుపులేటి శీను స్థలం ఖాళీ చేయాలని గతేడాది నుంచి ఇబ్బంది పెడుతున్నాడని అన్నారు. అతనికున్న పలుకుబడితో కొంతమంది మున్సిపల్ ఉద్యోగులతో వచ్చి నోటీసులు తెచ్చి ఇల్లు కూలగొడతామని బెదిరిస్తున్నారని అన్నారు. శీను పేర ఏ విదమైన భూమికి చెందిన డాక్యుమెంట్లు లేవన్నారు. ఈ స్థలంలో అపార్ట్‌మెంట్ కట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరారు. తాము నివాసం ఉంటున్న భూమిని పరిశీలన చేసి ఆన్‌లైన్ చేయాలని కోరారు. కనమాల జయ కుమార్, ఎస్‌కె జిలాని, సిహెచ్ సంపత్ కుమార్, యేసు దాసు, ఎం విజయ్, జాస్మిన్, ఎం విజయకుమారి పాల్గొన్నారు.

తల్లిని హత్య చేసిన కొడుకు అరెస్ట్

ప్రజాశక్తి - బాపట్ల

హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి

మండలంలోని పుండ్ల గ్రామంలో ఈనెల 25న తల్లి రమణమ్మను హత్య చేసిన కొడుకు జాలయ్యను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గోగినేని రామాంజనేయులు వెల్లడించారు. పూండ్ల గ్రామానికి చెందిన పెనిమిటి రమణమ్మ గ్రామంలోని తన రెండో భర్త శ్రీనివాసరావుతో కలిసి పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. మొదటి భర్త చనిపోవడంతో ఆమె రెండో వివాహం చేసుకుంది. మొదటి భర్తతో ఆమెకు ఇద్దరు సంతానం ఉన్నట్లు చెప్పారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ షెడ్డులో పనిచేస్తున్న వారికి గత కొన్ని నెలలుగా జీతాలు రాకపోవడం, వచ్చిన జీతం ఒక్కసారిగా రూ.42వేలు రావడంతో అదే షెడ్డు వద్ద 2వ భర్తతో కలిసి మృతురాలు కొడుకు మద్యం సేవిస్తున్నారని అన్నారు. కొడుకు జాలయ్య అక్కడికి వచ్చి మందు తాగడానికి తల్లిని డబ్బులు అడగడంతో తల్లి నిరాకరించింది. డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని పక్కనే ఉన్న ఇనప రాడ్డుతో తలపై కొట్టి హత్య చేశాడని అన్నారు. మృత్యురాలి భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని అన్నారు. నిందితుడు జాలయ్య హత్య చేసి పారిపోగా చుండూరుపల్లిలో అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించి చేదించిన సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారని చెప్పారు.

అంబేద్కర్ విగ్రహం స్టాండు ధ్వంసమైన దృశ్యం

అంబేద్కర్ విగ్రహాన్ని ఢీ కొన్న లారీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రధాన కూడలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం స్టాండును లారీ ఢీ కొట్టింది. ఘటనలో విగ్రహం స్టాండు ధ్వంసమైనది. పాల లారీ ప్రమాదవశాత్తు విగ్రహం వద్ద స్టాండును ఢీ కొనడంతో అది ధ్వంసం అవగా అంబేద్కర్ విగ్రహానికి ఎటువంటి నష్టం వాటిల్ల లేదు. ఈ విషయంపై స్థానిక యువకులు అంబేద్కర్ విగ్రహానికి రక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు.

దుర్వాసన వెదజల్లుతున్న వీధులు

ప్రజాశక్తి - అద్దంకి

చుట్టుపక్కల ప్రజలు అటు వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి పట్టణంలో ఏర్పడింది. రోడ్ల వెంబడి దుర్గంధం వెదజల్లుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలు రాకపోకల సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ, సచివాలయ అధికారులకు ప్రజలు చెప్పినప్పటికీ నిర్లక్ష్యపు సమాధానాలతో కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని తిమ్మాయపాలెం సచివాలయ పరిధిలో ఎక్కడపడితే అక్కడే వ్యర్థ పదార్థాల కుప్పలు పేరుకున్నాయి. గత కొద్ది రోజుల క్రిందట కలెక్టర్ ఆదేశాలతో మండలంలో పలు గ్రామాల్లో రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తరలించారు. అయితే తిమ్మాయపాలెం పంచాయతీలో కొంత భాగం వ్యర్థాలు తొలగించినప్పటికీ ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రామాయపాలెం రోడ్డు వెంబడి మాత్రం వ్యర్థాలు తొలగించలేదు. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సచివాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛభారత్ అంబాసిడర్లను పురమాయించి చెత్త తొలగించి కంపు వదిలించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు

ఐకమత్యం పెంపొందించడమే దేశభక్తి : జెవివి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

దేశంలో కులమత భేదాలు తొలగి పౌరులందరిలో ఐకమత్యం పెంపొందించడమే నిజమైన దేశభక్తి అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. జయప్రకాష్ తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు, విశ్వకవి గుర్రం జాషువా, మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని జెవివి ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశభక్తి ప్రచార వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. హర్షిణి డిగ్రీ కళాశాలలో జెవివి నగర అధ్యక్షుడు ఎస్‌వి. రంగారెడ్డి అధ్యక్షతన ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష విజ్ఞానంలో నాలుగో స్థానంలో ఉన్నా సమాజంలో ఇంకా కుల వివక్ష, మత విద్వేష భావనలు ఉండటం బాధాకరమన్నారు. జెవివి అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ గత 38 ఏళ్లుగా జెవివి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కషి చేస్తుందన్నారు. ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని సూచించారు. నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌టి. వెంకటేశ్ మాట్లాడుతూ యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మానవ విలువలు, నైతిక బాధ్యత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ దాడి అంజనేయులు బహుమతులు అందజేశారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో...

జెవివి నగర అధ్యక్షుడు రంగారెడ్డి అధ్యక్షతన ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి నగర కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు మూఢనమ్మకాల వెనుక ఉన్న శాస్త్రీయ అంశాల గురించి వివరించారు. ఆడపిల్లలపై ఉన్న మూఢనమ్మకాలను సమూలంగా తొలగించాలన్నారు. అనంతరం విజేతలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయప్రకాష్, కళాశాల ప్రిన్సిపల్ సురేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నేడు గుర్రం జాషువా జయంతి సభ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి సభ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఒంగోలు జిల్లా గ్రంథాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మిడసల మల్లికార్జున రావు,కనమాల రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సభలో ఆగమశాస్త్ర పండితులు డాక్టర్ పరాంకుశం కేశవా చార్యులు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సభలో కవులు, రచయితలు, కళాకారులు, జాషువా అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువత ఆలోచనకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత ఆలోచనలకు ప్రాధాన్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ -2026 కార్యక్రమాన్ని రూపొందించినట్లు స్టెప్ సిఇఒ పి. శ్రీమన్నారాయణ తెలిపారు. జనవరి 12న జాతీయ యువజనోత్సవంలో పాల్గొనేందుకు 15-29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత మై భారత్ పోర్టల్ ద్వారా అక్టోబర్ 15లోపు వికసిత్ భారత్ క్విజ్, ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఎలాంటి రుసుం లేకుండా యువత ఆన్‌లైన్‌లో పాల్గొనే వీలుందన్నారు. ఎంపికైన వారికి ప్రధాని ముందు తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పారిశుధ్య కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ పారిశు ధ్యకార్మికుల పెండింగ్ జీతాలు తక్షణమే విడుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ టి. మహేష్, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి టి. విజయమ్మ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత నాలుగు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.కరోనా కాలంలో నియమించబడిన కార్మికులు వేతనాల లేమితో అప్పులపాలు అవుతూ, కుటుంబ పోషణలో కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిరోజూ రవాణా ఖర్చులు భరించలేక చాలామంది నడిచే పరిస్థితి ఉందన్నారు. వైద్యసౌకర్యాల కోసం ఇఎస్‌ఐ కార్డులు లేకపోవడం వల్ల కుటుంబాలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు, ఇఎస్‌ఐ గుర్తింపు కార్డులు, ప్రతి నెలా సక్రమంగా వేతనాల చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే సోమవారం నుంచి పోరాటం తప్పదని యూనియన్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నాయకులు భారతి, సరిత, దివ్య, పద్మ, పోతురాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడతున్న టి. మహేష్

జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సూపర్ జిఎస్‌టి , సూపర్ సేవింగ్స్‌పై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. జిఎస్‌టి కమిషనర్ మురళికష్ణతో కలిసి కలెక్టరేట్‌లో జిఎస్‌టి సేవింగ్స్ హెల్ప్ డెస్క్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనాలు, ఎలక్ట్రానిక్స్, మందులు, వస్త్రాలు, నిత్యావసర వస్తువులపై జిఎస్‌సి తగ్గింపు ఉందన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌పి ఉమామహేశ్వర్,జిఎస్‌టి కమిషనర్ మురళికష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఎఒ మల్లికార్జున రావులతో కలిసి సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

కరప్రతాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పర్యాటక అభివృద్ధికి తోడ్పడండి

పర్యాటకాభివద్ధిలో భాగస్వామ్యం అయ్యే సంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు, హౌస్ బోట్స్ ,కయిజ్ అభివద్ధి, హౌస్ బోట్స్ బిల్డర్లు, ఆపరేటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కృష్ణా నది తీర ప్రకతి సౌందర్యం, సముద్రతీరం, కష్ణానది బ్యాక్ వాటర్, మడ అడవులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయని తెలిపారు. ఈ మేరకు ప్రతిపాదన అందజేస్తే తగిన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ జిఎం నాంచారయ్య, ఇతర రాష్ట్రాలకు చెందిన హౌస్ బోట్స్ బిల్డర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

జిల్లాలో యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు తీసుకెళ్లవచ్చునని జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా 235 మెట్రిక్ టన్నుల యూరియా ను 2,765 మంది రైతులకు శనివారం పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా 225 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు లో ఉందని ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డులో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల డంపింగ్ యార్డు లోని లెగిసిని నిర్దిష్ట కాలపరిమితి లోపు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక జమ్ములపాలెం రోడ్డులోనున్న డంపింగ్ యార్డును కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులోని యంత్రాల పనితీరును, చెత్త రీసైక్లింగ్ గురించి మున్సిపల్ కమిషనర్‌ను అడిగి ఆరా తీశారు. డంపింగ్ యార్డు లోని చెత్తను రీసైక్లింగ్ చేసే పనిని గుంటూరులోని ఎంఎస్ తారుని అసోసియేషన్ వారు చేపట్టారని, వారు మార్చి 2025న అవార్డు పొందే నాటికి యార్డులో 46,264 మెట్రిక్ టన్నుల చెత్త ఉందని, అందులో ఇప్పటివరకు 40 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసినట్లు కమిషనర్ రఘునాథ రెడ్డి కలెక్టర్ కు వివరించారు. 10,000 టన్నుల కంటే తక్కువ చెత్త ఉండే మున్సిపాలిటీలలో రీసైక్లింగ్ యంత్రాల ఏర్పాటు కష్టతరమని, ఆ చెత్తను దగ్గరలోని మున్సిపాలిటీల డంపింగ్ యార్డులో డంపింగ్ చేసి అక్కడ రీసైక్లింగ్ చేసి తరలించాలని రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారని,అందువల్ల రేపల్లె మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త బాపట్ల డంపింగ్ యార్డులో డంపింగ్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వివరించారు. డంపింగ్ యార్డులోని చెత్తను యుద్ధ ప్రాతిపదికన ప్రాసెసింగ్ చేసి అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎంఎస్ తారుని అసోసియేషన్‌కు సంస్థకు కలెక్టర్ సూచించారు.

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

విజృంభిస్తున్న జ్వరాలు

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ జ్వరాలు సీజనల్ వ్యాధులేనని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. దోమల వ్యాప్తి, వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వస్తే వారం నుంచి పది రోజుల పాటు ఇబ్బందులు తప్పడం లేదని బాధితులు చెబుతున్నారు. జ్వర పీడితులతో వైద్యశాలలు నిండిపోతున్నాయి.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ళు దాదాపు ముగిశాయి.రాష్ట్రప్రభుత్వం పొగాకు రైతులకు చివరి ఆకు వరకూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే కేవలం 13,600 టన్నుల పొగాకు కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన పొగాకు రైతులకు నగదు చెల్లింపులు పూర్తిగా జరగలేదు. ప్రభుత్వం సూచన మేరకు పలు ప్రైవేట్ కంపెనీలు 20 వేల టన్నుల పొగాకును కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. రైతుల వద్ద ఇంకా దాదాపు 35 వేల టన్నుల పొగాకు నిల్వ ఉంది. ఇది కొంటారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవసాయ సీజన్‌లో నల్ల బర్లీ పొగాకు సాగు చేసినా, విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా, సహకరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు ప్రకటించారు. జీవో నెంబర్ 740 పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకోస టాస్క్ ఫోర్స్ కమిటీలు వేశారు.

బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రబీలో కూడా రైతులు వర్షాల ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నారు. భారీవర్షాల కారణంగా వచ్చే వరదనీరు వేగంగా బయటకు వెళ్ళే డెయినేజి వ్యవస్థ ఈ సీజన్‌లో కూడా బాగుకానందున రైతులు పంటలను నష్టపోతున్నారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొన్ని ప్రాంతాల రైతులకు మేలు కాగా , కొన్ని ప్రాంతాల రైతులకు నష్టం కలిగిస్తున్నాయి.

ఇటీవల కాలంలో రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరణాలు సంభవిస్తున్నాయి. వాహనాలు నడపడంలో నిర్లక్ష్యం, రహదారులు సక్రమంగా లేకపోవడం, మితిమీరిన వేగం రోడ్డుప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయి. రోజువారీ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్న కూలీలు,ఆటోలు, వ్యాన్లలో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. ఈ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. పలువురు క్షతగాత్రులవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువులపై జిఎస్‌టి తగ్గించింది. ఈ విషయంపై ప్రజలకు అవగాహన లేకుండా పోయింది.వ్యాపారులు చాలా వరకు పాతధరలతోనే అమ్మకాలు జరుపుతున్నారు.ఏ వస్తువులపై జిఎస్‌టి లేదు, వేటిపై ఎంత తగ్గించారు అనే విషయం సామాన్యులకు తెలియడం లేదు. ఈ విషయాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ విషయమై అక్టోబర్ 19 వరకు సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పేరుతో విస్తత అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజలు నిత్యం వినియోగించే నిత్యావసర సరుకులపై జిఎస్‌టి తగ్గింపుతో ఏ మేరకు లబ్ది కలుగుతుందోనని ప్రతీ ఇంటింటికి వెళ్లి తెలియజేస్తామంటున్నారు. నాలుగు వారాల పాటు ప్రతీ వారం ఒక థీమ్ తీసుకుని ప్రజలను కలువనున్నారు. ధరలు తగ్గించాల్సిన వ్యాపారులు, సంస్థలపై అధికారులు కన్నేయాల్సిఉంది. కొన్ని చోట్ల తాము గతంలోనే ధరలు తగ్గించామని చెబుతున్నారు.కొన్ని చోట్ల తమ వద్ద పాత సరుకు ఉందని వినియోగదారులకు చెబుతున్నారు.తక్షణమే వస్తువులపై జిఎస్‌టి తగ్గింపు అమలులోకి రావాల్సి ఉంది. క్రమంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా